# వైనతేయులు

ఇద్దరు కూర్చున్నారు. ఒకడు కథ చెపుతున్నాడు. రెండోవాడు వింటున్నట్టు నటిస్తున్నా వినలేదు. ఏమిటో ఆలోచిస్తున్నాడు. కథ చెపుతున్నవాడు చెపుతూనే వున్నాడు. పాత్రలు, పట్టణాలు, సంఘటనలూ దొర్లి పోతూనే ఉన్నాయి. నిఘంటువులో కనబడని మాటలూ, నిఘంటువులో లేనిమాటలూ తెగవాడేస్తున్నాడు రెండోవాడు వింటున్నాడనే ఇవన్నీ వాగీలేదు, వాడు వింటున్నా వినకపోయినా ఇదంతా పేలవలసిందే.

ఇద్దరు కూర్చున్నారు. ఒకడు ఆలోచిస్తున్నాడు రెండోవాడు ప్రక్కన కూర్చున్నట్టు నటిస్తున్నా కూర్చోలేదు; ఏమిటో ఆలోచిస్తున్నాడు ఆలోచిస్తున్నవాడు ఆలోచిస్తూనే ఉన్నాడు; పాత్రలు, పట్టణాలు, సంఘటనలూ దొర్లి పోతూనే ఉన్నాయి జీవితంలో కనబడని విషయాలూ, జీవితంలో లేనివిషయాలూ చెడుకల గంటున్నాడు రెండోవాడి కివి తెలియకుండా ఉండాలని ఆలోచిస్తున్నవాడి ఆశ.

ఇద్దరూ కూర్చున్నారు. ఇద్దరూ సిగరెట్లు కాలుస్తున్నారు. ఇద్దరూ బంగాళాదుంపలచిప్సు నంచుకొంటూనే ఉన్నారు. ఇద్దరూ బరువుగా మూసుకుపోతున్న కళ్ళని తెరచిందికి పరియత్నిస్తూనే ఉన్నారు. ఇద్దరూ కూర్చున్న గుడ్డివెలుగులోంచి ఈదుకుంటూ నిశ్చలమైన చీకటిలోకి చేరు

కొందికే ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇద్దరూ తిమ్మిరెక్కుతున్న ఒళ్ళు ఇంకా తిమ్మిరెక్కాలని ఆశపడుతూనే ఉన్నారు.

ప్రక్కన వాగుతున్న రేడియో వాళ్ళిద్దరికోసమే వాగుతున్నాది; మీాద తిరుగుతున్న పంకా వాళ్ళిద్దరికోసమే తిరుగుతున్నాది. వెలుగుతున్న బత్తీలు వీళ్ళిద్దరికోసమే వెలుగుతున్నాయి, గాని ఆ నాలుగుగోడల అవతలఉన్న ప్రపంచంలోని రాపిడి, తొక్కిడి, రాకపోకలు, ప్రకటనలు, అమ్మకాలు, జేబు దొంగతనాలు, దయా ధర్మాలూ వీళ్ళిద్దరికోసం జరగడం లేదు

కథ చెపుతున్న వీడిమాటలు మచ్చుకి ఇక్కడ కొన్ని రాస్తే కోం పడతారు. ఆలోచిస్తున్న వాడి ఊహాలు ఉదహరిస్తే గవర్నమెంటువాళ్ళు కేసు పెడతారు. అయినా ఇద్దరూ వాళ్ళు చేస్తున్న క్రియల్ని చేస్తూనే ఉన్నారు. ఒకడు పేలుతూ ఉన్నాడు; ఒకడు కునుకుతూ ఉన్నాడు.

మాట్లాడుతున్నవాడి మాటలను తెలుగులోకి తర్జుమా చేసిందికి ప్రయత్నిద్దాం. 'ఉత్తుత్తికాయ, ఉత్తరేణికాయ, దానిమ్మాకాయ దబ్బకాయ. రాత్రేమయిందనుకొన్నావు. భూమికేకేసింది, సీతా అమ్మవారు దిగబడిపోయారు. ఏరాడ కొండమీాద ఎండదిగింది. కొవ్వనేకథుందే అలాగే. చూడూ వింటున్నావా? నీ తల్లి కడుపు బంగారంగానూ, ఇలారా ఇంకొకటీ '

పై మాటలలోంచి మనం పిండగలిగిం దేమీ లేదు అయినా వాడు అంటున్న మాటలకి దే సమ్మకమైన తెనిగింపు

ఉచ్చారణదోషాలని మనం పాటించకుండావుంటే వాడు అంటున్న మాటలకి డిక్షనరీలు మిమసరీలు ఇచ్చే అర్థం చెప్తారు.

ఆలోచిస్తున్నవాడు ఏవని ఆలోచిస్తున్నాడో కూడా మెతుకుపట్టిచూస్తే ఎందుకేనా మంచిది. మధ్యనుంచితీద్దాం ఒక పీలికని. 'ఆవిడప్పుడువచ్చి పాలసీఈ అందించింది. నేను జున్నుగాని తిన్నంటాను. దుడుకుతనంతో చూస్తుంది. కూడదక తప్పుతుందా. పాలసీసాని విరక్కొట్టేస్తాను. వీడొస్తాడు; వచ్చి ఆవిణ్ణి బాదేస్తాడు. నేను చూస్తూ ఊరుకోలేక కలియపడతాను వాడి తడాఖా-బాబో'

పై కడిలోంచి మనం గ్రహించేది ఏదీలేదు. అయినా వాడు తలచుకుంటున్నది ఇదేఅని విశ్వసనీయంగా నేను చెప్పగలను. ఇతగాడి చరిత్ర తెలిసిన మహాశాస్త్రవేత్తలు దీనికి అర్థం వుందని చెప్పారు.

మాట్లాడుతున్నవాడు 'ఇంకొకటి' అన్నప్పుడు ఆలోచిస్తున్నవాడు తేరుకొని, 'ఇంకొక టేమిటి—ఇంకొకటెన్నర' అన్నాడు. పేలుతున్నవాడు 'ఛీఛీ! పరువుతక్కువ. అరలు మనదేశంలో వాడం. అయితే అయినవాడిపెళ్ళి! పూరా—రెండు రెండు! ఒకట్లు' అన్నాడు. కలలుకంటున్నవాడు 'ఊం రెండు రెండు పెద్దవి సుమా, మర్చిపోగలవు' అని హెచ్చరించేడు!

ఎవడితల్లి కడుపు బంగారం కాబోతున్నాడో వాడు—మూడోవాడు నవ్వుకొన్నాడు. ఈ మూడోవాడికథే మనం అసలు చెప్పుకోవలసింది. అయినా వాడు వుండీ లేనట్టే,

లేనట్టున్నా ఉన్నట్టే ఊగటూవుంటాడు. ఈ నవ్వినవాడు కొలతల ప్రకారం నవ్వుని దిమ్మరించేడు. నవ్వుకితోడు నవ్వుకి నాలుగింతల ఖుషి బరాయించేడు.

ఇద్దరూ నవ్వుని సేవించి మళ్ళా దీక్షలో పడ్డారు. ఈసారి ముందు ఆలోచిస్తున్నవాడు వాగడం ప్రారంభించేడు. ముందు కథ చెప్తున్నవాడు మూగనోము పట్టేడు. ఇద్దరూ ఈసారి బహుజాగ్రత్తతో కూర్చుందికి తంటాలు పడుతున్నారు. ఒకడు గాల్లో చెయ్యి కదిపి అందకుండా వుందన్నాడు. మూడోవాడు ఏమిటన్నాడు. అందకుండా వుందన్నవాడు స్వరాజ్యం అన్నాడు. మూడోవాడు ఫకాలుమని వెక్కిరించాడు.

మూగినోము పట్టినవాడు తేన్చి 'బ్ర-బ్ర-బ్ర-డార్-మరి-మరి-మరింతా' అని ప్రశ్నతోక జాడించేడు. కొత్త వాగుడుగాడు ముక్కి 'షిగరెట్లేవీ' అన్నాడు. 'వర్జీనియా? ఫరవాలేదు, మనకంతా ఒకటే' అన్నాడు. మూడోవాడు లాభంలేదన్నాడు. వాచీ పదిగంటలుకొట్టి లాభంలేక పోడాన్ని ద్వితీయపర్చింది.

మూడోవాడు ఇద్దర్నీ చెరోరెక్కా పట్టుకొని గుమ్మందాకా తీసుకొచ్చేడు. ఇద్దరూ దయ్యాలంటే మనం నమ్మేస్తాం. ఏవంటే వాళ్ళ కాళ్ళు భువిని అంటకుండావున్నాయి. ఇద్దరూ గాలిని ఊతతీసుకుని నిల్చున్నట్టు ఊడిపోతున్నారు. మరో లోకం పొరలు వాళ్ళ తలనుంచి కాళ్ళదాకా కప్పబడినట్టు మసక కమ్ముకొని వుంది.

వాళ్ళిద్దరూ ఇంతకుముందు కూర్చొనివున్న నాల్గు గోడల అవతల ప్రపంచంలోని రాపిడి, తొక్కిడీ రాకపోకలు ప్రకటనలూ, అమ్మకాలూ, జేబుదొంగతనాలు, దయా ధర్మాలూ, దీపాలూ ఒక్కసారి వాళ్ళిద్దర్నీ పలకాయించి వాటి వాటి రొటీషనులో పడ్డాయి. ఇద్దరూ ద్వారాన్ని చీల్చుకొని లోకంలో అప్పుడే పడుతున్నట్టుంది.

మూడోవాడు ఇద్దరి జేబుల్నీ సవరించి వదిలేడన్న విషయం మనకి జ్ఞాపకం ఉంచవలసినది కాదు ఇద్దరు రిక్షా వాళ్ళు గుమ్మందగ్గరకి వచ్చి నించున్నారు. మూడోవాడు వాళ్ళిద్దర్నీ అప్పచెప్పి లోపలికి మాయమైపోయేడు.

రిక్షావాళ్ళు ఎక్కడకని అడక్కుండా ఇద్దర్నీ రిక్షాలో కూలదోసి లాక్కొని పోయారు. వాళ్ళకి తెలుసు, ఇక్కడికొచ్చే ఇద్దరూ ఎక్కడికి మూడొంతులు వెళ్ళేది. వెలుతురులో చక్రాలు దొర్లిపోతున్నాయి, రిక్షాలు చకచకా పరిగెడుతున్నాయి.